# అంత్యారంభాల అంచున

ద్వారం దగ్గర అలికిడి అయినట్టనిపిస్తే తలెత్తి చూశాడు అసిరన్న. గవిరేసు నిలబడి చూస్తున్నాడు. "ఏట్రా గవిరిగా అనా సూస్తన్నావ్ సిల్లంగెట్టీవోడ్నాగ?"

" అయితొరె అసిరన్నబావా, వుడుకుడుకంబలి నివ్వు జుర్రీడవేనా, మాలాటోల్లకి కూడా కసింత ఎట్టడవుందా? "

"రారా, నీ కడ్డేటి, వొచ్చి కూకుని తిన్రా! అయినా, నాను కూకుని తినమని పిలిస్తేమట్టుకు నివ్వీ అంబలి కూడు తింటావేటి? ఉడుకుడుకన్నం, ఆవుమజ్జికా, ఆవకాయిబద్ద నేకంట నివ్వు ముద్దెత్తవని నీ బారియ వూరందరికాడ దండోరా యేస్తుంటాది కదా! "

" ఓరి పల్లకోయేస్! అదేట్నేదురా బావా! నాకేటి మళ్లా మాన్నేలా- అందల ఒరిసన్నాలో, మసూరీలో పండించి తినీనానికి! బియ్యింగింజలేనా, సోడిగింజలేనా బజార్లో కొనుక్కోవల్సిందేకదా నాలాటోడికి! "

" అందికని, ఆ కొనీదేదో బియ్యం గింజలే కొంతన్నావ్ ! అంతేనా? గవిరిగా, ఆదికి నీలాటోడే అన్నవయితేనేఁవిరా, మరి సున్నవయితేనేఁవిరా, యీ పాడు పొట్టకి అన్నవే ఏతావుఁరా అని తత్వాలు పాడేవోడట. నీ యదుష్టం కూడా ఆనెక్కనే వుందిరా గవిరిగా! పూర్వం రోజుల్లోనయితే గడ్డిబళ్లతోలీ, సరివీకంపతోలీ సిన్న సిన్న కమిసన్లు సంపాదిస్తుండీ వోడివి. ఇయ్యాల రేపట్ల నీ దశ తిరిగిపోనాది. లేఅవుట్లుకి దలారీవయినాక మనగేవాలంటే నివ్వేబుర్ర తిప్పుడుగాడివైపోనావు. ఇప్పుడు నివ్వాడింది ఆట, పాడింది పాట. నీ యవతారఁవూ మారిపోనాది. ఇప్పుడు నీ తెల్లటి కఁవీజు, నీగేస్గోపంచి గుండారు, నీజరదాకిల్లీ, పొద్దుకూకీ తప్పటికి నివ్వెక్కిగుర్రం అబ్బో! నివ్వురా నాయింటికాడ అంబలికూడు తినీది"

" అసిరాగా, నానేదో తినీసి అనుబగించెస్తన్నానని నీకేట్రా ఏడుపు? తినాలంటే నీకేటి లేదా, పోదా? అంగట్ల అన్నీ వున్నాయి, అయినా అల్లుడి నోట్ల శనిట! అనాగున్నది నీ వొరస! తలుసుకుంటే సాలు యియ్యాలంటియ్యాల లచ్చలకి లచ్చలొచ్చి నీవొళ్లో పడిపోతాయి. అయినా డబ్బు నాకక్కర్నేదని టలాయించేసి, యిదిగిలాగ గెంజీ, అంబలీ కతికి దిక్కుమాలినోడ్నాగ రోజులు గడపతన్నావ్! ఎందుకొచ్చిన పడుదర్లయిది? ఎవుడ్ని మెప్పించాలన్రా యినాటి బతుకు బతకతన్నావ్? నివ్వు బాదలు పడ్డం సాల్నట్టు,ఆ ముసిల్దాయిని కూడా కడుపుకింత ఇష్టంవైన కూడేన తిన్నానికి

ఈఁల్లేకంటసేస్తున్నావు. ఇంత యానమా నంగ బతకనానికి ఏటవుసరంవొచ్చిందిరా నీకు? "

గుడిసె వెనకాతల పిడకల తరుస్తున్న లచ్చువమ్మకి గవిరేసు మాటలు వినిపిస్తూనే వున్నాయి.వాడు చివరిగా అన్నమాటలు చెవిని పడేటప్పటికి చేస్తున్నపనిని వదిలిపెట్టేసి చేతులేనా కడుక్కోకుండా, పూనకం వచ్చినదాన్లా వూగిపోతూ, రివ్వున లోపలికి దూసుకువచ్చింది. అంత దూకుడుగానూ గవిరేసు ముందుకొచ్చి,

" ఏట్రా పేల్తన్నావ్ గవిర్నాకొడకా? మావెప్పుడూ ఎవుడి మేర్బానీ కోసం బతకవ్‌రా! మావు బాదలు పడిపోతన్నావని ఏ గాడిది కొడుకురా నీకాడ కూసింది? నా మొగుడి గొప్పతనం నీలాంటి బోకర్నాకొడుకులుకెనా తెలుస్తాదిరా? ఒక్క సిటం యెనకాతల నీయంతటనివ్వే అన్నావుకదా! లచ్చులొచ్చివాల్లో పడుతుంటే ఒద్దని కూకున్నాడని. డబ్బుమీద కోరిక సంవుకున్న మనిసి ఎంతటి గొప్పోడయ్యుండాలో దమ్మిడీకోసం సెప్పుల్నాకీ నీలాటోడికెనా తెలుస్తాదిరా? నివ్వసలేల మా గుమ్మంకాడి కొచ్చినావు? ముందిక్కడ్నుంచి కదుల్తావా, కాలిరిసీమన్నావా?" అని కాళికాదేవిలా విరుచుకుపడి పోయింది లచ్చువమ్మ. ముంగిలా అక్కణ్నించి జారుకున్నాడు గవిరేసు.

కోపంతో వూగిపోతున్న భార్యని పొదివిపట్టుకొని, ఆమె దూకుడ్ని తగ్గించడానికి "లచ్చివీ లచ్చివీ, ఏలేయమ్మ అంతకోపం? కసింత ఓర్సుకోయే, ఓర్సుకో " అని ఆమెని శాంతింప చెయ్యడానికి ప్రయత్నించేడు అసిరన్న. తనవి పేడచేతులనేనా చూస్కోకుండా మొగుడ్ని వాటేసుకుని భోరుమని ఏడ్చింది లచ్చువమ్మ. ఆమె గుండెల్లో లేస్తున్న మంటలు అసిరన్నకి అర్ధమవుతూనే వున్నాయి. వాళ్ళిద్దరూ మేనత్త మేనమావ పిల్లలు. చిన్నప్పట్నుండీ ఒకళ్లని విడిచి మరొకరు వుండలేకపోయేవారు. చూడముచ్చటగా కనిపించే వాళ్ళిద్దరికీ చిన్నవయసులోనే ముడిపెట్టేశారు వాళ్ళ పెద్దలు. వాళ్ళిద్దరిదీ ఎప్పుడు ఒకటేమాట, ఒకటే వూహ. అరవైఏళ్లు పైపడుతున్నా ఒక్కక్షణం అంటే ఒక్కక్షణం కూడా ఒకర్ని విడిచి మరొకరు వుండలేరు.

లచ్చువమ్మ గుండెల్లో చెలరేగుతున్న మంట యిదీ. " ఈనాటికి ఓ బోకర్నాకొడుకు, దేవుడ్నాటి తన మొగుడ్ని ఏలెత్తి సూపించీ మొగోడయినాడా? అసలాడికింత దయిర్యం ఎనాగొచ్చినాది? ఆ ఇద్దరు గుంటసచ్చినోల్లవల్లేకదా,అందరికీసులకనైపోనాం! కుటవాన్ని(కుటుంబాన్ని)సెడబుట్టినారు ముష్టిగాడిదకొడుకులు !"

శోకదేవతలా రోదిస్తూ మొగుడి గుండెల్లో తలదాచుకుంటూ, ఆ మాటే అన్నాది లచ్చువమ్మ బయటికి, " కడుపున బుట్టిన పిల్లలేమన్ని సులకన్చేసి యేరింటి కాపరాలికి ఎల్లిపోనాక, మనవెవుల్ని అనుకొని ఏటినాబం!"అని కళ్లొత్తుకుంది.

"అదీమాట! కొడుకులేదో వుద్ధరిస్తారనుకోడం మన్దే తప్పు. రెక్కలొచ్చిన పచ్చులు ఎగిరిపోతాయిగాని, అయ్యో నాన్న, అయ్యో అమ్మ అని ఆలోసిన్తా కూకుంటాఏటి? అలిసిపోయి(రెక్కల్తో గూట్లో తొంగోవల్సిన ముసిలిపచ్చులం మనం. ఆడన్న మాటల్ని, యీడన్నమాటల్ని పడుతూ గడుపుకోవలిసిందే కొసరోజుల్ని, పొరుసాలు పడి నాబంనేదు"

" ఏలయ్యా, ఏల మనం అలిసిపోనాం? ఎవులికోసం మనం అల్సిపోనాం? కడుపున పుట్టిన బిడ్డలకోసం మనం రెక్కలు ముక్కలు సేస్కొని బతికితే, ఆల్లదారి ఆల్లుసూస్కొని మన్నిలావొగ్గినేదా?

"లచ్చివీ, ఎవులో మన రెక్కలిరిపేసినారని మనంవెందుకేడవాల? రోజులలా మారిపోనాయి. సంచుల్తో డబ్బులు, యిసిత్రవయిన సోకులు కల్లముందు నిత్తివూ అవుపిస్తుంటే, అమ్మలూ, నాన్నలూ, అపిమానాలు యాదస్తుంటాయేటి? మనవింకా పాతరోజులు పట్టుకొని యేల్లాడుతున్నాం. మంచిరోజుల్నాడు ఎల్లిపోకంట మిగిలిపోనాక, యీ దయిద్రపు రోజుల్ని తల్సుకొని యినాగే బాదలుపడాల"

"అవున్లే, ఏనాడు ఎవుల్ని పల్లెత్తు మాట అన్నావని యియ్యాల నీ కొడుకుల్ని తప్పుపడతావ్' ' నిష్టూరం ధ్వనించింది లచ్చువమ్మ గొంతులో.

ఆమెని బుజ్జగిస్తూ "అదికాదే లచ్చివీ, ఎవుల్ననుకొనీ ఏటీనాబం నేదని సరిపెట్టుకోవాల! లే, లెగిసి కసింత ఆ పేడసేతుల్ని కడుక్కోని యీ గిన్నిలోని అంబలి తినీమీ. బతుకుల్లో నెగస్తున్న అగ్గిమాటెనాగున్నా, కడుపులనెగస్తున్న అగ్గికి ఇంతకూడేసి ఆరపక తప్పదు కదా! నానలా ఓపాలి పారయ్యకాడికెల్లి నాలుగు బస్తాలు దాన్నం గింజలు అప్పియ్యమని అడిగొస్తాను. మల్లీ పంటలొచ్చినాక బాకీ తీర్సేద్దాం " అని అంబటి గిన్నె ముందునుంచి లేచిపోయి, నోరు పుక్కిలించి వుమ్మేసి, చింకితువాల్తో మూతి తుడుచుకుంటూ, పారయ్య యింటివేపు బయల్దేరేడు అసిరన్న.

వెళ్తున్న ఆ మనిషిని చూస్తుంటే దుఃఖం ఆగలేదు లచ్చువమ్మకి. అన్ని రాజభోగాలు పోగొట్టుకొని, ఏకచక్రపురంలో ఇంటింటికీ తరిగి అన్నం అడుక్కున్న ధర్మరాజులవారు గుర్తుకొచ్చేరు ఆమెకి. అసిరన్న కూడా ధర్మరాజులాటివాడని వూర్లో అంతా అనుకుంటారు. తన వ్యవసాయవేదో, తన పనేదో అంతే! ఎవరి విషయాల్లోను జోక్యం చేస్కోడు. ఎవరేనా అడిగితేనే సలహా. ఆయిచ్చే సలహా ధర్మదేవత యిస్తున్న న్యాయంలా అనిపించేది.

ఆరెకరాల పల్లంలో వ్యవసాయం వున్న రోజుల్లో యిల్లంతా పంటే అన్నట్టుండేది. ఆ మంచిరోజులు ఎందుకనో వెళ్ళిపోయాయి. మరి వాళ్ల బుద్ధికే పుట్టిందో, ఎవరేనా వాళ్లకి పురెక్కించారో తెలీదుగాని, నోట్లోనాలిక లేనట్టుండే కొడుకులు అకస్మాత్తుగా వాటాలు పంచమని కూర్చున్నారు. గెడ్డవారున్న

రెండెకరాలు తమ వాటాగా నిర్ణయించేరు పంచాయితీదార్లు.

"అసిరన్నా, నివ్వుముదరోడివై పోనావు. గెడ్డవార భూవయితే నీటికి ఎటామిటీ వొచ్చిన్నాడు. నివ్వు కష్టపడక్కర్లేకంట నీ పొలానికి నీరెక్కుతాది. కసింత దూరంగున్న పొలాలు గుంటలకిచ్చేస్తే, అవుసరవయిన్నాడు కష్టపడేనా నీరు కట్టుకుంటారు" అదీ పెద్ద మనుషులు ఉద్దేశం. గెడ్డవార పొలం నిజంగానే మంచి పొలం. అందులో బంగారం పండుతుంది. అయితే ఈ వయస్సులో పగలనక రాత్రనక వూర్లోంచి యింత దూరం నడిచొచ్చి పొలం చూస్కుంటుండడం కష్టం. అందుకని వూర్లో వున్న పెంకుటింటిని కూడా కొడుకులకిచ్చేసి పొలంకి దగ్గిరగా వున్న పోరంబోకు దెప్పిమీద గుడిసెవేస్కొని వొచ్చేశారు.బతుకు మళ్లీ మరోమారు కొత్తగా ప్రారంభించినట్టయింది యీ వయసుకాని వయసులో.

అయితే, అనుకున్నదొకటయితే జరిగింది మరొకటయింది. ఈ ఏడాది బొత్తిగా ఒరుప్పెట్టేసింది. కాలువలొస్తాయని ఎదురుతెన్నులు చూస్తుండగానే పిడుగులాటి వార్తొచ్చింది. ఎగువ భూములన్నీ లేఅవుట్లయిపోడంతో లేఅవుట్లవాళ్లు వాళ్ల జాగాల్లోకి నీరు చొరబడకుండా చెయ్యడం కోసం కాలువని కప్పేశారట జబర్దస్తీగా. కాలువ కప్పేయడం కాదుగాని బంగారం పండుతుందనుకున్న తమ పొలంలో మదుపులకు పెట్టినన్ని గింజలు కూడా పండలేదు. తిండికి కటకట ఏర్పడింది. ధాన్యం బదులిమ్మని అడగడానికి మరొకరి దగ్గిరకి వెళ్తున్నాడు తన మొగుడు. బతుక్కి కొసరోజుల్లో వచ్చిన దీనావస్థని తల్చుకొని కుమిలి కుమిలి ఏడుస్తోంది లచ్చువమ్మ.

ఆలోచనల్తోసతమతమయిపోతూ పారయ్య లోగిలిముందుకొచ్చిన అసిరన్నను చూస్తూనే "రారా అసిరిమావా నీకు వందేళ్లు ఆయుస్షు! నీమాటే అనుకుంతన్నాం" అన్నాడు పారయ్య.

తెల్లటి చొక్కా, ఖద్దరు పంచెగుండారు, ఎద్దుమెడలా బలిసిన మెడలో పచ్చగా మెరిసిపోతూ బంగారం గొలుసు, షోకైన కుర్చీలో ఒయ్యారంగా ఓ పక్కకు వాలికూర్చున్న విధానం, నోట్లో పొడుగాటి చుట్ట- ఈ వరసలో వున్న పారయ్యని చూసేటప్పటికి వుస్సురనిపించింది అసిరన్నకి. పారయ్య కుటుంబం ముందునుండీ వున్నవాళ్లే. అయితే ఈమధ్యనే ప్రారంభించిన లేఅవుట్ల వ్యాపారంలో కోట్లకి పడగెత్తేడు పారయ్య. నెల్లూరు మేస్త్రీలను తెప్పించి, డబ్బు బిళ్లపెంకుల్లా వెదజల్లి యీ భవంతిని కట్టించేడు. దాన్ని చూడ్డానికి రెండు కళ్లు చాలవంటారు వూరిజనం. అలాటి పారయ్య ఇంటిముందు, ముతకపంచె, ముసలి వయస్సు, ముడతలుపడ్డ ముఖంతో దిష్టిబొమ్మలా వున్నాననుకున్నాడు అసిరన్న. అది తల్చుకునే వుస్సురని నిట్టూర్పు. ఇంత హోదా వున్న పారయ్య,తనని ఆదుకుంటాడా అని అనుమానం. అయితే పారయ్యే ప్రారంభించేడు."అయితారే అసిరన్నమావా! నీ పొలం మాటేట్రా?" అని.

" నా పొలం మాటా? నివ్వేటంతన్నావో నాకు తెలకంటున్నాదిరా పారయ్యా"

" అదేట్రా, నీవోటా బూవి కూడా అమ్మకంసేస్తావా అని "

కోపం తన్నుకొచ్చింది అసిరన్నకి. తనకున్న డబ్బు దన్ను చూస్కొని ఎదుటివాడు ఎటువంటి మనిషనేన చూడకండా అడగరాని విషయాన్ని కూడా ఎంత ధైర్యంగా అడుగుతున్నాడీ పారయ్య! 'నీ పొలం(వమ్ముతావా' అని గతంలో తనని అడగడానికి ఎవుడికీ సాహసం వుండివుండదు. కాని ఇప్పుడు రోజులు మారిపోయేయి. తనలాటి వాళ్లకి కాని రోజులొచ్చేసాయి. పారయ్య అడిగిందానికి కోపం తెచ్చుకొని ఏంచెయ్యగలడుతను? పేదోడి కోపం పెదివికి చేటు. ఈ రకంగా ఆలోచించి, కోపాన్ని అణిచేస్కొని, ఎంతో నెమ్మదిగా,

" పారయ్య, నానేటి, బూవిని అమ్మడవేట్రా? మా కుటుంవల ఎవుడేన, ఎప్పుడేన బూవుల్ని అమ్మకానికెట్టినాడేట్రా? "

" అసిరన్నమావా, నా నొకటడుగుతాను సెప్మీ, నీ చాదస్తం ,మరీ జనవకి పోదేట్రా?"

" నాకు సేదస్తవా? పోనీ నువ్వన్నదే రైటనుకో- నాలాటి ముసిలోడిక్కాకపోతే మరెవుడికుంటాదిరా సేదస్తం? "

" ఏదాంతం కసింత ఆపి నాను సిన్నోడ్నయినా, నానుసెప్పే లోకదరవం కసింత ఆలకించు. ఎవసాయం మనం ఎందుకు సేస్తున్నావురా? కడుపుకింత తిండికోసం. మన తిండికి సరిపోయినాక, యింకా యేవేనా గింజలు మిగిలితే అమ్ముకుంటాం. అమ్ముకొని ఆ పైసాల్ని పైకర్సులకి వాడుకుంటాం. నారాయణపురం డేమ్ వాచ్చినాక మనకి కాలువలొచ్చినాయి. ఆ తరవాత అమ్మోనియాలు, యూరియాలు వొచ్చినాయి. రెండేసి పంటలు పండిస్తన్నాం. పూరవం ఎకరాకి పాతిక పుట్లు పండినమడకల్లో యియ్యాళ రెండేసి గరిసిలు పండిస్తన్నాం. పంటలు పెరిగి చేతినిండా డబ్బు అందుకున్నాం. గుడిసెలు పీకేసి పెంకుటికొంపలు, డాబాలు కట్టించుకుంతన్నాం. ఎవసాయాల మీదొచ్చే డబ్బుసాల్లే అని కూకోకంట ఏపారాలు కూడా మొదలెట్టినాం. నానడిగీదేటంటే, యియ్యాల మనకి కసింత కలిసిందికదా అని సంబరపడిపోయి వూరుకుంటావా, నేకపోతే ఇంకా కసింత ముందుకెళ్లాలని సూస్తావా? "

" తెలివైనోడు ఎప్పుడూ ముందుకే నడుస్తాడు. మనవంతా మరింత బాగుపడ్డానికి మారగాలు కనిసిస్తున్నాయి. అయేటో మీయందరికీ ఎరికీ. ఇయ్యాల రేపట్ల టౌన్లు పెరగతున్నాయి. ఎక్కడెక్కడి జనాలు టౌన్లకి పారొచ్చి యిళ్లు కట్టేసుకోవాలనే యావమీదున్నారు. ఇళ్లు కట్టుకోనానికి జాగాలు కావాల. టౌన్లంట యెక్కడా దోసెడు జాగా దొరక్కంటుంది. అంచేత యిళ్ల జాగాలకోసం వూరవతలకొచ్చీసి, మన పొలాలమీద పడ్డారు. పొలాలకి అడ్డకి పడ్డ దరలిచ్చేసేనా కొనీడానికి

సిద్దంగున్నారు. కొనేసిలేలఅవుట్లు సేసేస్తున్నారు. అంచేత యినాటప్పుడు, సిరొస్తంటే మనవేల కాలడ్డాల? డబ్బొచ్చివోల్లో పడతానంటున్నప్పుడు ఒద్దని కూకునీవోడు వుట్టి జడ్డోడయ్యుండాల! నా దుక్కేసూడుమీ, నానిప్పటికి ఇరవై ఎకరాలమ్మినాను యీ లేఅవుట్లుకి. నా తండ్రినాటోడివి. నీకాడ దాపరికవేల? సాటకోటాని నాకిప్పటికి అరవైలచ్చలుపయినే ముట్టినాయి. మా కుటవల యిన్ని తరాల్ల ఏనాడేన, ఎవుడేన, కల్లోనేన అంత డబ్బు కల్ల సూసినోడున్నాడా? ఇయ్యాల బూవులకి ఇంతా అంతా అని సెప్పలేనంతాదర్లు పుట్టినాయి. ఇనాటప్పుడు కాకాపోతే యింకెప్పుడమ్మతావు బూవులు? అమ్ముకో! అమ్ముకొని డబ్బుసేస్కో! ఎవసాయాలు వుండవంటావా? లేకపోతేవి? ఆ వొచ్చిన డబ్బెట్టి మరోయేపారం సేస్కో అంతేగాని, ఇంతేసి డబ్బొస్తన్నప్పుడు "నాను ఎవసోయం ఒగ్గను, మట్టీ పేడా కుమ్ముకుంటు, యీ పొలాలంటే కూకుంతాను, ఎంతొస్తే అంతే తిని బతకతాను. " అని ఎవుడేనా మొండిపట్టు పట్టుకుక్కాకున్నాడంటే, ఆడ్ని జడ్డోడనుకోకంట, యింకేటనుకోమంటావో సెప్మే! "అని తను చెప్పదలిచింది చెప్పి ముగించేడు పారయ్య.

తన మాటలు అసిరన్నమీద ఎలా పనిచేసేయో చూడాలని కాబోలు, అసిరన్న వేపే చూస్తున్నాడు.

పారయ్య మాటలు బోదపర్చుకోలేనంత అజ్ఞానేం కాదు అసిరన్న. అయినా తనకి పారయ్య చెప్పింది అర్ధంకానట్లు " అయితొరే పారయ్యా! నాను సూస్తే ముసిలోడ్ని, నాకేట్రా యిలోకదరమాన్నంతా బోదిస్తన్నావ్? " అన్నాడు.

సర్రుమన్నాడు పారయ్య. " నీక్కాక్కపోతే మరెవుడికి బోదపరుస్తా నేస్! మరీ డొంక తిరుగళ్లల్ల ఏలగాని, నామటుకు నాకేటనిపిస్తుందెరికా? మనూర్ల ఎందుకూ పనికిరానోడ్లా కనిపిస్తున్నోడివి నివ్వొక్కడివే! బూవులికి బంగారంనాటి దర్లు పలుకుతుంటే యినిపించుకోకంట ఎవసాయం, ఎవసాయం అని పట్టుపట్టుకుక్కాకున్నోడివీ నివ్వే! "

పారయ్యకి సమాధానం చెప్పడానికి కొంచెంసేపు కిందా మీదా పడ్డాడు అసిరన్న. ముసిలాడి ఏవిటి చెప్తాడో వినాలని కాబోలు, పారయ్య యింటిముందు చేరిన కుర్రజట్టల్లా కొంచెం ముందుకు జరిగి, ఆసక్తిగా చూస్తున్నారు. మాటలకోసం తడువుకుంటూ, తడువుకుంటూ ప్రారంభించేడు అసిరన్న.

" పారయ్యా! నివ్వు సిన్నోడివైనా తెలివైనోడివి. అందికని నాను సెప్పింది ఎంతలెక్క నిజివో కసింత ఆలోసించు. ఎవసాయివో, ఎవసాయివో అని నేను సస్తన్నది నానొక్కడ్నీ బతికేయాలనీ, నాగాదే నిండిపోవాలని కాదురా నాయినా. మనిసికి బతకనానికి తిండిగింజలు కావాల. దేవుడు పుట్టిచ్చిన యీ కోటిన్నొక్కజీవుల్లోని మనిసొక్కడే పంటలు పండించి తిండిని తయారు సేస్కుంతన్నాడు. ఈ బూదేవత వొందల వొందల ఏళ్లకాడ్నుండి, యిన్ని లచ్చల కోట్ల జనాభాకి

తిండినిస్తన్నాది. ఇయాల సంచులు కొద్దీ డబ్బు మనకల్లముందు కనపడతన్నాదని, కావదేనువు నాటి బూవిని ముక్కలు కొట్టీసి యిళ్లజాగాల కింద అమ్మిపారేస్తే, రేపు యీ జనాలల్ల యేటితిని బతుకుతార్ర? బూవుల్ని దిబ్బలు సేసేస్తే పంటలెక్కడ్నుండొస్తాయిరా? మీరంత సేస్తన్న నిర్వాకాలకీ యేటి జరుగుతాదో సెప్పనానికి నానే నిదర్సినంగా యియ్యాల మీ ముంగట నిలబడివున్నాను, సూస్కోండి. ఏనాడూ నా యింట్ల తిండిగింజలకి కరువన్నది లేదు. అలాంటిదియాళ, మీ లేఅవుట్ల పున్నివా అని కాలువలంట నీరు రాకంట అయిపోయి, నా పొలంల గిద్దెడు గింజలేనా పండలేదు. తిండికి ఒకడి ముందు సెయ్యి సాపనేదు. అనాటిది నాను రెండెకరాల బంగారంనాటి పొలం పెట్టుకొని, దిక్కుమాలినోడ్లాగ దాన్నం గింజలు అడుక్కోనానికి నీ లొగిలి కాడికొచ్చినాను.

నాసిన్నప్పటి బోగట్ట ఒకటి సెపతానినండి. రాయలసీమల ఏళ్లతరబడి ఓనల్లేక, పంటలు పండక కరువు కాటకాలొచ్చి ఎన్ని లచ్చలమంది జనాలు సచ్చిపోనారో ఎరికా? ఆనాట్రోజుల మళ్లీ యీదేశింల రాకూడద నేన్ర నా ఏడుపల్ల ! నాయినోరే పారయ్య, నాకేట్రా, నా వొయసు అయిపోనాది. రేపో మాపో యీ లోకంలెల్లి ఎల్లిపోతాను. నా బాదల్ల మీ గురించేన్ర! ఎక్కడ సూసినా వూళ్లు, ఇల్లు నేసీసి పొలాలు పాడు పెట్టెస్తున్నాం కదా! కొసకి యీ కోట్లు కోట్లు మంది జనాబా ఏటితిని బతుకుతార్రా? ఇయాల మనం యీ డబ్బుపిశాచం సేతిలసిక్కిపోతే, రేపు మన గుమ్మాలకాడికొచ్చే ఆకలిపిశాచంకి ఏటి తినబెట్టి అపగలుగుతాంరా ? ముందుతరాల్నాడు గుమ్మాలకాడికి వొచ్చే ఆకలి పిశాచం మాట కసింత యిప్పట్నుండే యాదస్తుంచుకోండిరా నాయనా! "అని వలవల ఏడ్చాడు అసిరన్న.

చుట్టూ చేరి వింటున్నవాళ్లకి కనిపించని ఏ దేవుడో చేస్తున్న హెచ్చరికలా వినిపించేయి అసిరన్న మాటలు. ఇదీ అని చెప్పడానికి వీలులేని ఏదో దిగులు ఆవరించింది వాళ్లందర్నీ. సందడి, సరదా మాటల్తో కలకల్లాడుతుండే పారయ్య యింటివసారా కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దంగా దివ్వు దివ్వుమంటున్నట్టనిపించింది.

పాదరసంలాంటి పారయ్య బుద్ధి జరుగుతున్నదాన్ని చప్పున గ్రహించింది. లేఅవుట్ల వుద్యమానికి నాయకుడు తను. ఇప్పుడు అసిరన్న మాట్లాడిన మాటలు తన దూరదృష్టిమీద వ్యాపార దక్షతమీద గ్రామంయావత్తు పెంచుకుంటున్న నమ్మకాన్ని దెబ్బ తీసేట్లున్నాయి. చుట్టూ చేరిన జనాలు అసిరన్నమాటలే నిజాలన్నట్లు తలలూపుతున్నారు. అంచేత అసిరన్న వాదనని అడ్డుకోవలసిన బాధ్యత తన మీదుంది. ఈ రకంగా ఆలోచంచి,

" మాఁవోరే, నివ్వు సెప్పిందల్ల నిజివేన్ర, నాను కాదన్ను " అని ప్రారంభించేడు. అంతా పారయ్యవేపు తలతిప్పి ఆలకించడం మొదలెట్టేరు.

" నివ్వుపెద్దోడివి. నీకున్నఅనుబవం మాగుంటజట్టుకుంటాదేటి? అయితే నీలాంటి పెద్దోళ్లే సెప్పిన మాటొకటున్నాది 'నారు పోసినోడు నీరు పొయ్యిడా' అని. ఇక్కడ మన బూవుల్ల పంటనేకపోతే, దేశింలో మరోకాడ పంటలుండవేటి? లేదు యీ దేశింలోనే పంటల్నే కంటయిపోతే, సెపంచికంల మరి పంటలు పండే దేశాలేనేవా! అక్కడ్నుంచి తిండిగింజలు తెప్పించుకుంతాం. నానూ కసింత సదువుకున్నాను కాదా! నాకు తెలిసిందేటంటే, అరబ్బీదేశాలుత్తి ఎడార్లు. అక్కడ పంటలన్నమాటేనేదు. అయితక్కడ జనాల్లేరా. ఆల్లంత తిండిలేక సచ్చిపోతన్నారా? పిట్రోలు అమ్మకాలవల్ల ఆల్లకి యింతా అంతా అని సెప్పనానికి యీల్లేనంత డబ్బు. ఆ డబ్బెట్టి ఎక్కడెక్కడ్నుండో తిండి, మావసం తెప్పించుకుంతుంతారు. మనవూ అనాగే సేస్తావ్. బూవుల్ని లేఅవుట్లు సేసేసి మనగేం సెడిపోడంనేదే? చిత్తుగ డబ్బు సంపాదిస్తన్నాం. ఈ సెపంచికంల డబ్బున్నోడిదే రాజ్యం. ఆడు కావాలంటే కొండమీది కోతేనా దిగొస్తాది. అందికని మనం గిరిగీసుక్కూకుంటే మనకే నష్టం. మరి ముందుకెల్లలేం. ఎప్పటికప్పుడు యింకా కసింత ముందుకెళ్లి సూద్దాం అన్న దుష్టుంటేనే మనిసి పెరుగుతాడు. నేకపోతే యెక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టు యీ మట్టీ, యీ పేడా పిసుక్కొని యినాగే వుండిపోతాం" అని తను చెప్పదల్చుకున్నది పూర్తయినట్లు తెలియచెయ్యడానికి చుట్టతీసి, విలాసంగా కొసకొరికి, తాపీగా ముట్టించి పొగనొదిలేడు పారయ్య చివరిగా,

" అంచేత నాను సెప్పేదేటంటే, నీ కొడుకుల్నడిచిన మంచి దారంట నివ్వూ నడిస్తే బాగుంటాది " అన్నాడు.

" నా కొడుకులా ? ఆల్లే మంచి దారంట నడస్తన్నారని, నన్ను ఆల్లదారిని నడమంటావ్? "

" మంచిదారని మెల్లిగంతావ్! నీ కొడుకులెనాటి తెలివైనోల్లయినారో యెరికా? నన్ను మద్దివర్తిగా యెట్టి, పోటాపోటీలమీద దరపెరిగేటట్టు సూసుకున్నారు. నివ్విక్కడికి రాడానికి కసింతముందు నా యింటికాడే ఎగ్రిమెంట్లు కట్టేసి. అడమాన్సుగా చెరిరెండేసి లచ్చలు నొట్టికెలిపోయినారు. నీ కొడుకులుకీ ఒక్కొక్కల్ల వాటకి అయిదేసి లచ్చలొస్తన్నాయి"

పారయ్య మాటలు అసిరన్నకి వినిపించడంలేదు. తను నిల్చున్న భూమి కృంగిపోతున్న భావం కలుగుతోంది అతగాడికి . అకస్మాత్తుగా మతిభ్రమణం కలిగినవాడిలా తనలోతను సణుక్కోడం మొదలెట్టేడు. "వోటాలు పంచమని నాతో తగూలకి దిగింది యిందుకా ముష్టి ఎదవల్లారా! నాతో కలిసుంటే బూవుల అమ్మకం వొల్లకాదని తెలిసి, యిదిగినాగ ఎత్తెత్తినారా? కుటవాన్ని సెడబుట్టినార్రా సెతకారీ నా కొడకల్లారా! నాలుక్కాలాలపాటు ఎవసాయంసేస్కొని, పిల్లపాపల్తో సుకంగుంటారని నా నాశిపడితే, బూవుల్నమ్మేసి, గేమం ల ఇంటిపేరు నేకంటసేస్తారా?

మిమ్మల్నే దేవుడుకాస్తాడ్రా'' ఇలా తనలోతను గొణుక్కుంటూ స్తంభానికి చేరబడి, చతికలబడిపోయేడు అసిరన్న.

ఆస్థితిలో అసిరన్నని చూడగానే యెందుకో గాబరాపడ్డాడు పారయ్య. తనొకసారి ఓ రెండెకరాల భూవమ్మి మిల్లు కడదామని అన్నప్పుడు తన తండ్రి అచ్చం ఇలాగే విలవిల్లాడుతూ రాటకి చేరబడి కూర్చోబడిపోయాడు. పశువులసాల్లో ఆనాటి తండ్రి రూపం అసిరన్నలో కనిపించి గుండెలో ఏదో బాధ మెలిక తిరిగినట్లనిపించింది. పాతకాలం మనిషి! చాదస్తం మనిసి. బతికినన్నాళ్లు బతకడు. కాని ఇప్పటికిప్పుడు మతిభ్రమించి, చచ్చిపోతే, ఆ చావుకి నింద తనమీదపడుతుంది. అంచేత ముందు ఈ ముసిలాడ్ని బుజ్జగించో, మంచి మాటల్చెప్పో మామూలు స్థితికి తేవాలి అని నిశ్చయించుకొని, కుర్చీలోంచి లేచి అసిరన్న భూజంమీద ఓదార్పుగా చెయ్యివేసేడు. ఆ స్పర్శలో ఏదో ఆత్మీయతాభావం తగిలింది అసిరన్నకి.

" నా సొంత కొడుకులేనాడూ నా భుజంమీద సెయ్యేసి, అబిమానంగా 'అయ్యా!యిదిగి నాగరా' అని ఏ ఒక్క సంగతీ ఏనాడూ సెప్పిన సాపాన పోలేదు. ఆల్ల మొకాలమీద జడుపో, అపనమ్మకవో తప్ప, మరేటీ కనిపించీంది కాదు'' అనుకున్నాడు అసిరన్న. అలాటిది యివాళ పరాయివాడనుకున్న పారయ్య భుజంమీద చెయ్యివేసి,

" మావా, నువ్వో సుట్టు ఇంట్లోకి రమ్మి!'' అని పిల్చేటప్పటికి, యిదీ అని చెప్పలేని వూరట కలిగింది. పారయ్య ఆసిరన్నని లేవదీసి చెయ్యిపట్టుకొని లోపలికి తీసుకువెళ్ళాడు.

లోపలికి వెళ్లేటప్పటికి కళ్లు జిగేలుమన్నాయి అసిరన్నకి. హాలంతా చలవ పందిరిలా కనిపించింది. సోఫాలు, కుర్చీలు, ఫేన్లు కిటికీలకి రంగుఅద్దాలు, వెలుతురు పూర్తిగా రాకుండా సగంసగం మేర వేసిన తెరలు, కింద రంగు రంగుల రవ్వగచ్చులు! ఏదో ఇంద్రభవనంలోకి ప్రవేశించినట్లనిపించింది అసిరన్నకి. మెత్తగా వున్న సోఫాలో అసిరన్నని కూర్చోబెట్టి, ఎదురుగా తనో కుర్చీలో కూర్చున్నాడు పారయ్య. పిలుపు వినపడగానే రెండు గ్లాసుల్తో మజ్జిగ వచ్చింది. ఆవురావురుమని ఆ మజ్జిగని తాగేడు అసిరన్న. ఏదో తెలియని లోకంలోకి వచ్చిపడిన భ్రాంతి కలిగింది ముసలాడికి.

లోపలికి రాగానే పారయ్య గొంతులో కూడా మార్పు వచ్చింది. బయట వరండాలో నలుగురితోనీ కూర్చున్నప్పుడు బండగా, గట్టిగా మాట్లాడిన పారయ్యేనా ఇప్పుడు మాట్లాడుతున్నది అనిపించింది అసిరన్నకి. మెల్లగా, మెత్తగా అల్లరిచేస్తున్న చిన్నపిల్లవాడ్ని దారిలోకి తేవడానికి ప్రయత్నిస్తున్న తండ్రిలా మాట్లాడ్డం ప్రారంభించేడు పారయ్య.

" మాఁవా నివ్వూ నా అయ్యలాటోడివే! ఒక్కసారి యీ గదిసుట్టూ సూడుమీ! మాఅయ్య

బతికినన్నాళ్లు, గడ్డికొంపలంటా, మట్టిజాగాలంటే మసిల్నాం. నాను బతికినన్నాల్లు ఎవసాయం తప్ప మరోటి సెయ్యనానికి యీల్లేదని మంకుపట్టు పట్టుక్కూకున్నాడు మా అయ్యి. ఆడు ఎలిపోనాక గదా, నాను ఎవసాయంతోపాటు యేపారాల్లోకి కూడా దిగినాను. ఏపారం మీదొచ్చిన లాబాల్తో మా తాతల్నాటినుంచి వున్న బూమికి రెండింతలు బూమిని కొత్తగా కొన్నాను.

నాను సెప్పేదేటంటే, మనిసి ఒక్కాడే వుండిపోతే పెరగనేడు. నాను అయిస్కూలుసదువు సదివినానుకదా! అందల నేర్చుకున్నదేటంటే, పచ్చిమాఁవసంతోటే, తోలుగుడ్డల్తోటి, సెట్టు తొర్రల్తోటే సరిపెట్టుకొని వుండిపోతే, మనిసీలెక్కన ఎదిగుండేవోడుకాదు. అందుకని ముందుకెల్లాలని సూస్తున్నోడ్ని మనం ఆపకూడదు. ఆడు ముందుకెల్లి కొత్త కొత్త రాజ్యాలే ఏల్తాడో, నేకపోతే ఏ గంగలోనో మునిగిపోయి పత్తానేకంటయిపోతాడో మనకెనాగ తెలుస్తాది? ఆడుముందుకెల్తేనేకదా! మనిషి తెలివైనోడు కాబట్టే, మిగిలిన అన్ని జీవుల్ని కొట్టేసి తను పైకి లేచిపోయినాడు. అంచేత పొలాలు పోతే పంటల్లేకంట అయిపోతాయి, పంటల్లేకపోతే ఉపస్తులుండాల. యీ లెక్కన మనం ఆలోసించకూడదు. ఏది జరిగినా, ఎనాగో ఓనాగ మనిసి యీ బూమ్మీద బతికి తీరతాడు అని మనకి నమ్మకం వుండాల. మన ఆలోసన్లు ఆ రకంగా వుండాల" అన్నాడు పారయ్య.

అసిరన్న కొంచెంసేపు నిదానంగా ఆలోచించిగాని సమాధానం యివ్వలేకపోయాడు. "నాయినోరే పారయ్య, నా కొడుకులు కంటె నివ్వే మంచోడివిరా! ఆల్లేనాడు ఆల్ల ఆలోశన్లని నాకు సెప్పడానికిగాని, నీలాగ బోదపర్చనానిగ్గాని సూడ్నేదు సరికదా, నక్కపోతుల్లాగ దొంగదెబ్బల్తియ్యనానికే సూస్తుండేవోల్లు. పోనాల్ల సంగతి ఇప్పుడేలగాని, నివ్విప్పుడు సెప్పిన సంగతులన్ని నిజివే! కల్లముందు నిదర్సినాలు సూపించి మరీ మాట్లాడతన్నావు నువ్వు. అందికని నివ్వు సెప్పిందాన్లో మెలికనేదు. అయితే, నాను, నా పెళ్లాం ముసిలోల్లవయిపోనాం. ముసిలోల్లకి యెలిపోయినకాలం మీదే దృస్టుంటాదిగాని, ఒచ్చేకాలమీదుండదు. ఈ వొయిసులో మావేవనుకుంటే అదే నిజంలాగా, పయోల్లు సెప్పిందల్లా అబద్ధంనాగా అనిపిస్తుంటాది. నామటుకు నాకు ఎవసాయవే బూమ్మీద మనిసిన్నిలబెట్టి, బతికించినాదని, అనిపిస్తుంటాది. పుట్టెడు గింజలు పండించి, పట్టెడు మెతుకులు పది మందికీ పెట్టే వృత్తి ఎవసాయం. దానికన్న ఎక్కువ పున్నిం సేస్కున్న వృత్తి ప్రపంచికంలా మరోటేదేనా వుంటాదేటి? వడ్డీ యేపారంసేసో, మరో యాపారంసేసో సంపాదించిన లచ్చరూపాయలుకన్న, గరిసెడు గింజలమ్మి, నలుగురి కడుపునిండ యింత తిండి పెట్టి సంపాదించిన గుప్పెడు డబ్బులు ఎక్కువరా నాయినా!

అందికని, నాయినా, నాయినా! సచ్చి నీ కుటుంవల పుడతాన్ర. అప్పుడు కావాలంటెనన్ను బంగారం తొట్టిలో యెట్టి వూపింతువుగాని. పెచ్చితానికి మాతరం నాను నమ్ముకున్న బూదేవతనే నమ్ముకొని నన్ను బతకనియ్యి! నా తదనంతరం నా కొడుకులు నా బూమిని యే లేలవుట్లుకో,

అంతకంటె డబ్బెక్కువస్తాదనిపిస్తే యే వొల్లకాటికో అమ్మేసితీరుతారు. మా ఇద్దరం బతికినన్నాల్లు మాత్రం మావు నమ్ముకున్న బూవిమా కల్లముందునుండి ఎగిరిపోకంట సాయం చేయ్యరానాయినా! నీ తండ్రిని కాదని ఏదీ ఏనుడూ సెయ్యనేదని నివ్వే సెప్పినావుకదా! నానూ నీ అయ్యిలాటోడ్నేనుకొని, నన్నూ నా బూవినీ కాపాడు'' అని పారయ్య చేతులు పట్టుకొని కంటతడిపెట్టేడు అసిరన్న.

" ఊరుకోర మావ, సంటిగుంటడ్నాగ మాటికీ యేడుపేట్ర'' అని అసిరన్న కన్నీటిని తన తువాలు చెంగుతో తుడిచి, ఒక్కక్షణం ఆలోచన్లోపడి, ఒక నిశ్చయానికి వచ్చి "మావా, నివ్వూ, అత్తా బతికినన్నాల్లు నీకిష్టమైన ఎవసాయివే సెయ్యి! నీ కేలోటురాకంట నీ కొడుకులకన్న ఎక్కువగా నిన్ను సూస్కునే పూచీ నాది. కాలువులు కప్పేసీనారని, నీరు రాకంటున్నాదని బెంగట్టుకోకు. బోరు తీయించేనా నీ పోలంకి నీరందేనాగ సూత్తాను. మరేబెంగా ఎట్టుకోకు. నిజవే, మా అయ్యే బతికుంటే అడ్డి తలాయించి నానేదేన సేసుండేవాడ్నేటి. నిన్ను గౌరవంగ సూస్తే, మీదనున్న మా అయ్య కూడా సంతోసిస్తాడు. నీలాటోడు ఎవసాయంసేసి పంటలు పండిస్తుంటే మావు సేస్తన్నది రైటా నువ్వు చేస్తన్నది రైటా అని తయిపారేసి సూస్కోనానికవుతాది'' అన్నాడు పారయ్య

మాటలు పెగల్లేదు అసిరన్నకి. పారయ్య మాటలు నిజవేనా అని సందేహం రాకపోలేదు. కాని తనకి భరోసా యిస్తూ పారయ్య తన చేతిలో వేసిన చెయ్యిలో నమ్మకద్రోహం తగల్లేదు. కరిగిపోయిన ధైర్యం మెల్లిమెల్లిగా ఒంట్లోకి వచ్చి చేరుకుంటున్నట్టనిపించింది పారయ్య స్పర్శలో,హాల్లో వున్న పారయ్య తండ్రి ఫొటోకి రెండు చేతులూ ఎత్తి దండం పెట్టేడు. తరవాత మెల్లిగా లేచి నిలబడి "ఎయ్యికాలాలపాటు సిరిసంపదల్తో, పిల్లాపాపల్తో ఎత్తిరిల్లురా నాయినా " అని పారయ్యని దీవించి, మెల్లిగా బయటికి వచ్చి యింటిముఖం పట్టేడు అసిరన్న.

" మావోరే! సాయింత్రం ఆరుబస్తాల దాన్నం పనోడిసేత తోల్తాన్లేరా'' అని వెనక నుంచి పారయ్య కేక వినపడింది. మల్లీ ఓమారు వెనక్కితిరిగి, పయినున్న దేవతలకి మొక్కి ఇంటికి బయల్దేరేడు అసిరన్న.

గుడిసె దగ్గరకొచ్చేటప్పటికి " మాఁవా! యిన్నావా కొడుకులు సేసిన నిర్వాకం? తాతల కాడ్నించొస్తున్న మాన్యాన్ని యిల్లజాగాలకి అమ్మేసినారట'' అని బావురుమంది మాలచ్చివి. ఆమెని పొదివి పట్టుకొని వాకిట్లో వాల్చివున్న నులకమంచమీద కూర్చోబెడుతూ "ఊరుకోయే మాలచ్చివీ, ఊరుకో! ఏటయిపోతాదని మనవేడవాల? ఎవుడేటిసేసినా మనిసన్నోడు యీ బూమ్మీదవుండకా పోడు, ఎనాగో ఓనాగ బతక్కాపోడని పారయ్య సెప్పినాడు. ఆడి మాటని నమ్ముదాం. సూర్యాస్తవయం అయిపోతన్నాది. గడిసేపు మాటాడకంట కూకొని, అనాగ పొలాల్ని సూడుమీ! మనం సూడాలని మనుసుపడ్డా ముందునాటికి యీ పొలాలుండవు!'' అన్నాడు అసిరన్న.

(ఆగష్టు 1996 - విపుల)

✪ ✪ ✪